క్లుప్తంగా

ఆర్థిక సహాయం

భాగ్యనగర్‌కాలనీ: సాయిచరణ్ కాలనీకి చెందిన యాదమ్మ, జన్మభూమి కాలనీకి చెందిన భీమమ్మ అనారోగ్యంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ కుమారుడు దొడ్ల రామకృష్ణగౌడ్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి డీవీజీ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మమ్మ, రహమాన్, శివ, శ్రీధర్‌చారి, సుకన్య, యోగి, నరసింహ, రవి తదితరులు పాల్గొన్నారు.

సమతానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ సమతానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం జరిగాయి. మొత్తం 91 ఓట్లు ఉండగా పోల్ అయిన ఓట్లు 84 ఓట్లు. కాగా అధ్యక్షులుగా సతీష్ గౌడ్, రాజేందర్‌లు 30 ఓట్లతో ఎన్నికయ్యారు. జనరల్ సెక్రటరిగా ఎస్. నరసింహులు 35 ఓట్లతో ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా పి. సుకృత్‌కుమార్ వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వారు మాట్లాడుతూ.. కాలనీ ప్రజలను కలుపుకొని కాలనీ సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

అతిథి అధ్యాపకుల వేతనాలు చెల్లించండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ డిగ్రీ, ఇంటర్ కాలేజీలు, గురుకుల విద్యా సంస్థల్లో పని చేస్తున్న అతిథి అధ్యాపకులకు నెలసరి వేతనాలు చెల్లించాలని తెలంగాణ డిగ్రీ లెక్చరర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కిశోర్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్య సంస్థల్లో పేద విద్యార్థులకు బోధిస్తున్న అతిథి అధ్యాపకులకు కేవలం 72 గంటల వేతనం చెల్లించడం దారుణమన్నారు. అధ్యాపకులకు చెల్లించే వేతనాలు కుటుంబ అవసరాలు తీరక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధికి అనేక పథకాలను అమలు చేస్తున్న సీఎం కేసీఆర్ అతిథి అధ్యాపకుల వేతనాల చెల్లింపు పై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న గొట్టిముక్కల వెంకటేశ్వరరావు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ 4వ ఫేజ్‌లో నివాసం ఉంటున్న అంగోత్ జయ అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరింది. ఆసుపత్రి వైద్యులు కాలికి ఆపరేషన్ చేయాలని సూచించడంతో కూకట్‌పల్లిలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయానికి వచ్చి సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావును సంప్రదించారు. దీంతో ఆయన ప్రభుత్వ సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయించారు. మంజూరైన 1 లక్ష రూపాయల చెక్కును ఆదివారం ఆమెకు అందజేశారు.

పట్టపగలు చోరీ.. కత్తితో దాడి

పారిపోతున్న దొంగను పట్టుకున్న స్థానికులు

మియాపూర్: పట్టపగలు ఇంట్లో చొరబడి దొంగతనం చేయడమేగాక అడ్డుకున్న ఇంటి యజమానిపై కత్తితో దాడి చేసి పారిపోతున్న దొంగను కుటుంబ సభ్యులు ,కాలనీ వాసులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ నాగేశ్వర్ రావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శేరిలింగంపల్లి, నెహ్రూ నగర్ కాలనీకి చెందిన దాసరి సాయిలు కుటుంబ సభ్యులు ఆదివారం లింగంపల్లిలో పెళ్లికి వెళ్లారు. సాయంత్రం గుల్బర్గా జిల్లా చించోళ్లికి చెందిన అక్బర్ పాష అనే వ్యక్తి వారి ఇంట్లోకి దూరి అల్మారాలో ఉన్న రూ. 1.17 లక్షల నగదు తీసుకుని పారిపోతుండగా ఇంటి యజమాని సాయిలు గమనించి అతడిని అడ్డుకున్నాడు. దీంతో అతను వెంట తెచ్చుకున్న కత్తితో సాయిలుపై దాడి చేశాడు. సాయిలు కేకలు విని అప్రమత్తమైన స్థానికులు దొంగను వెంబడించి పట్టుకుని చందానగర్ పోలీసులకు సమచారా అందించారు.. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కుటుంబ సభ్యు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. గాయపడిన సాయిలును కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ప్రత్యేక చర్చా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివముదిరాజ్ పేర్కొన్నారు. ఈ మేరకు గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో గోడపత్రికను ఆయన ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండప్రకాశ్ ముదిరాజ్, తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు, పటాన్‌చెరు బీసీ నాయకుడు నీలం మధు హాజరవుతారన్నారు.

ఆంగ్లేయులను గడగడలాడించిన యోధుడు

అల్లూరి సీతారామరాజు



అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులు అర్పించిన ఎమ్మెల్యే కృష్ణారావు

భాగ్యనగర్‌కాలనీ: బ్రిటీష్ సామ్రాజ్యాన్ని తన శక్తితో గడగడలాడించి భారత స్వాతంత్ర్య ఉద్యమానికి పునాది వేసిన మహనీయుడు, స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి సీతారామరాజు అని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం క్షత్రియ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉషాముళ్లపూడి రోడ్డులోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలు పార్టీల నాయకులు హాజరై ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

◆ ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. దేశం కోసం ఎందరో మహనుభావులు ప్రాణత్యాగాలు చేశారని వారిలో అల్లూరి సీతారామరాజు ఒకరని, అటువంటి మహనీయులను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదే విధంగా బీజేపీ సీనియర్‌నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు, గజ్జెల యోగానంద్, మొవ్వా సత్యనారాయణ, కొరదాల నరేష్, తదితరులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసిన వారిలో ఉన్నారు.



అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు



అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళులు అర్పించిన బీజేపీ నేతలు వడ్డేపల్లి రాజేశ్వరరావు తదితరులు

త్వరలో జన్మభూమికాలనీలో కమ్యూనిటీహాల్ నిర్మాణం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని జన్మభూమి కాలనీలో కమ్యూనిటీహాలు నిర్మాణం కోసం రూ.10 లక్షల అంచనా వ్యయంతో ఎమ్మెల్యే నిధులతో నిర్మించడానికి మంజూరు కోసం రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు పంపిన మంజూరి పత్రాన్ని స్థానిక కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్‌కు ఆదివారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. ఆల్విన్ కాలనీ డివిజన్ సమగ్ర, సంతులిత అభివృద్ధిలో భాగంగా జన్మభూమి కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు కమ్యూనిటీహాల్ నిర్మాణం కోసం ఎమ్మెల్యే నిధుల నుంచి 10 లక్షల రూపాయలను మంజూరు చేయాలని రంగారెడ్డి కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించామన్నారు. నిధులు మంజూరు కాగానే నిర్మాణాన్ని చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని తెలిపారు. అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు.



మంజూరు పత్రాన్ని కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్‌కు అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

10 నుంచి శంకరమఠంలో పంచలోహ విగ్రహ ప్రతిష్ఠ

మోతీనగర్: మోతీనగర్‌లో వేంచేసియున్న శ్రీశృంగేరి జగద్గురు మహా సంస్థానం శ్రీశృంగేరి శారదా శంకరమఠంలో ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు శ్రీ శారదాంబ పంచలోహ విగ్రహ ప్రతిష్ఠ, శ్రీ చంద్రమౌళీశ్వర, శ్రీశంకరాచార్య ఆలయ చతుర్వింశతమ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. అనంత శ్రీ విభూషిత జగద్గురు శ్రీభారతీతీర్థ మహాస్వామి వారు, జగద్గురు శ్రీ విధుశేఖర భారతీస్వామిల దివ్యానుగ్రహంతో ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

9వ తేదీ ఉదయం 10గంటలకు శ్రీ లక్ష్మీగణపతి హోమం, సాయంత్రం 6.30 గంటలకు సంకష్టహర చతుర్థి గణపతి వ్రతం కార్యక్రమంతో పలు పూజా కార్యక్రమాలు ప్రారంభించనున్నారు. 10వ తేదీ ఉదయం 7గంటలకు శ్రీశారదాంబ నూతన పంచలోహ విగ్రహ గ్రామోత్సవం, చతుర్వింశతితమ వార్షికోత్స పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని శ్రీ శారదా చంద్రమౌళీశ్వరుల, శ్రీ జగద్గురువుల దివ్యానుగ్రహానికి పాత్రుల కావాలని కోరారు.

నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయాలి

పటాన్‌చెరు టౌన్: నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండలపరిధిలోని ఇస్నాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 11వ తేదీన సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న నిరుద్యోగ మార్చ్‌కు బీజేపీ రాష్ట అధ్యక్షుడు బండి సంజయ్‌తోపాటు రాష్ట్ర, జాతీయ నాయకులు హాజరవుతున్నారన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి పార్టీలకతీతంగా నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు.

పిల్లల్లో సామాజిక స్పృహను పెంపొందించాలి

దుండిగల్: పాఠశాలల యాజమాన్యాలు విద్యతో పాటు పిల్లల్లో మానతాదృక్పథాన్ని, సామాజిక స్పృహను పెంపొందించాలని చినజీయర్ స్వామి అన్నారు. భౌరంపేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శాంతినికేతన్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా చినజీయర్ స్వామీజీ మాట్లాడుతూ.. ధనార్జనే ధ్యేయంగా కాకుండా అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉండేలా విద్యను అందించాలన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ.. 32 సంవత్సరాలుగా విద్యారంగంలో కొనసాగుతూ నాణ్యమైన విద్యను అందిస్తున్నామని అన్నారు. భౌరంపేట్ శాంతినికేతన్ క్యాంపస్‌ను సువిశాలమైన స్థలంలో అన్ని హంగులతో ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులను చదువుతో పాటు క్రీడాలను ప్రోత్సహించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ పురుషోత్తమ్‌రావు, వైస్‌చైర్మన్ గుర్రాల నాగేశ్వరరెడ్డి, డైరెక్టర్లు సిద్ధార్థ పాలినేని, కొలన్ మేఘనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎన్ పరిశ్రమలో ప్రమాదం

ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలు

పటాన్‌చెరు టౌన్: ఎంఎస్‌ఎన్ పరిశ్రమలో రియాక్టర్ వద్ద పనిచేస్తున్న ఇద్దరు కార్మికులకు గాయాలైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారం గ్రామ సమీపంలోని ఎంఎస్‌ఎన్ పరిశ్రమలో శనివారం రాత్రి ఒంటి గంట సమయంలో రియాక్టర్‌లో మెటీరియల్ వేస్తుండగా కార్మికులు మధ్యప్రదేశ్‌కు చెందిన రాజు కోలీ, శివ మంగిలేష్ సింగ్‌కు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే చికిత్స నిమిత్తం కంచన్‌బాగ్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వీసీ ప్రొ.సురేష్‌కుమార్ తీరు సరికాదు

ఉస్మానియా యూనివర్సిటీ: ద ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజస్ యూనివర్సిటీ (ఇఫ్లూ) వీసీ ప్రొ.సురేష్‌కుమార్ తీసుకుంటున్న విద్యార్థి వ్యతిరేక నిర్ణయాలపై ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి ధ్వజమెత్తారు. ఆదివారం ఓయూ క్యాంపస్‌లోని డిస్కార్స్ సెంటర్‌లో ఎస్ఎఫ్ఐ ఇఫ్లూ కమిటీ ఆధ్వర్యంలో కన్వెన్షన్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ఎల్ మూర్తి మాట్లాడుతూ.. వీసీ ప్రొ.సురేష్‌కుమార్ విద్యార్థి హక్కులను కాలరాసేల నిర్ణయాలు తీసుకోవడం దారుణమని, విద్యార్థి వ్యతిరేక చర్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తమకు అనుకూలమైన వారిని సెంట్రల్ వర్సిటీలకు వీసీలగా నియమించి జాతీయ విద్య విధానం ముసుగులో విద్యను కాషాయికరణం చేస్తుందని ఆరోపించారు. ఉపకార వేతనాల్లో 58 శాతం కోత విధించి పేద విద్యార్థులను ఉన్నత విద్య దూరం చేస్తుందని ధ్వజమెత్తారు. సమాజంలో మనుధర్మశాస్త్రాన్ని అమలు చేసేందుకే బీజేపీ ప్రభుత్వం డార్విన్ జీవపరిణామ సిద్ధాంతాన్ని తొలగించారన్నారు.

ఇఫ్లూ ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ..

ఇఫ్లూ ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి ఆదివారం ప్రకటించారు. అధ్యక్షులుగా ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా అభయ్ క్రిష్ణ, ఉపాధ్యక్షులుగా అలెక్స్, అబ్రహాం, సహాయ కార్యదర్శిగా శ్రేష్ఠభట్టచార్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కూచిపూడి నృత్య ప్రదర్శన



శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం శ్రీవాగ్దేవి నృత్యనికేతన్ గురువు కళ్యాణి తేజేస్వర్ రావు శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన ఇచ్చారు. ఆనందనర్తనం, సరస్వతి శబ్దం, ముద్దుగారే యశోద, వినాయకకౌతం, అదిగో అల్లదిగో, బ్రహ్మాంజలి, శివపంచాక్షరి తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. కళాకారులు గీతిక, కావ్య, పల్లవి, హిమజ, నిహారిక, భవ్య, ప్రణతి, శ్రీహర్షిణి పాల్గొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీజీపీ వీవీ శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కృష్ణ పాల్గొన్నారు.

- మాదాపూర్

ప్రజా సమస్యలపై పోరాడదాం...

అధికార పార్టీని తరిమేద్దాం

- బీజేపీ రాష్ట్ర నేత రవికుమార్ యాదవ్
- మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి



గడప గడపకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా సమస్యలను పరిశీలిస్తున్న పన్నాల హరీష్‌రెడ్డి, రవికుమార్‌యాదవ్

ఆల్విన్‌కాలనీ: గడప గడపకు బీజేపీ కార్యక్రమం 29వ రోజుకు చేరుకుంది. ఆదివారం పార్టీ రాష్ట్ర నాయకుడు రవికుమార్ చేపట్టిన పాదయాత్ర ఆస్‌బెస్టాస్ కాలనీలో కొనసాగింది. ఈ సందర్భంగా ఇంటింటికీ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి మాట్లాడుతూ... ఇంత గొప్ప కార్యక్రమాన్ని తలపెట్టిన రవికుమార్‌యాదవ్‌ను అభినందించారు. డివిజన్‌లోని నాయకులు, స్థానికులు ఈ పాదయాత్రకు పూర్తి మద్దతు ఇవ్వాలని తెలిపారు. రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ.. అధికార నాయకుల బెదిరింపులకు పార్టీ కార్యకర్తలు ఎవరూ భయపడొద్దని.. ఎదురు దాడికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

◆ పాపిరెడ్డినగర్ కాలనీలో 58, 59 జీవోల కింద ఇళ్ల రెగ్యులేషన్ చేస్తామని చెప్పి ఓట్లు దండుకున్న నాయకులు ఇప్పుడు మొహం చాటేస్తున్నారని.. రాన్ను రోజుల్లో కాలనీ వాసులు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు నరేందర్‌రెడ్డి, పర్వతాలు యాదవ్, రాజిరెడ్డి, గోవర్ధన చారి, వెంకటేష్, శ్రీనివాస్‌పటేల్, శ్రీకాంత్ యాదవ్, శ్రీధర్ పటేల్, సాయి, బాలు యాదవ్, మురళీ కృష్ణ, ఇంద్ర కుమార్, ఉపేందర్, నరేష్, రఘునాథ్, చంద్రయ్య, సిద్దయ్య, లక్ష్మమ్మ, మణెమ్మ, అరుణ తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలతో కూడిన కరపత్రాన్ని అందజేస్తూ..

నిరుద్యోగ సంఘర్షణ యాత్రను విజయవంతం చేయండి

టీపీసీసీ సభ్యుడు సత్యం శ్రీరంగం



కూకట్‌పల్లి: ఇంటికో ఉద్యోగం అంటూ కేసీఆర్, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలను మోదీ యువత ఆశలతో ఓట్లతో చెలగాట మాడుతున్నారని పీసీసీ సభ్యుడు సత్యం శ్రీరంగం పేర్కొన్నారు. మతం, మద్యం మత్తులో ముంచి పబ్బం గడుపుకుంటున్నారన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తానని కేసీఆర్ మాట తప్పారన్నారు. తెలంగాణ నిరుద్యోగులకు వారిపై ఆధారపడిన కుటుంబాలకు అందరికి బీఆర్‌యస్ శోకమే మిగిల్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి కల్పిస్తుందన్నారు. యువత ఆకాంక్షలు, అమరుల ఆశయాలు నెరవేర్చేందుకు యువ సంఘర్షణ సభకు ప్రియాంక గాంధీ హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సభకు కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బీజేపీలో చేరికలు



బీజేపీ పార్టీలో చేరిన వారితో రాష్ట్ర నాయకుడు రవికుమార్ యాదవ్

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ నుంచి యువకులు వెంకటేష్, శ్రీనివాస్‌పటేల్, లక్ష్మమ్మ, మనెమ్మల ఆధ్వర్యంలో ఆదివారం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి, రాష్ట నాయకుడు రవికుమార్ యాదవ్‌లో సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రతి రోజు పార్టీకి ప్రజల నుంచి ఆదరాభిమానాలు పెరుగుతున్నాయని తెలిపారు. పార్టీపై నమ్మకం ఉంచి తమపై విశ్వాసంతో పార్టీలో చేరిన వారిని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ నియంతృత్వ, నిరంకుశ ప్రభుత్వాన్ని గద్దె దింపే వరకు ప్రతి ఒక్క కార్యకర్త అహర్నిశలు కష్టపడుతూ... ప్రజల్లో ఉంటూ వారి కష్ట, సుఖాలను తెలుసుకొని వాటి పరిష్కారం కోసం మార్గం చూపాలని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు నరేందర్ రెడ్డి, పర్వతాలు యాదవ్, రాజిరెడ్డి, గోవర్ధనాచారి, మురళీకృష్ణ, శ్రీధర్‌పటేల్, సాయికుమార్, శ్రీకాంత్ యాదవ్, బాలు యాదవ్, రమేష్‌యాదవ్, నరేష్, శ్రీనివాస్‌రెడ్డి, అరుణ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

- కలగానే మినీ ట్యాంక్‌బండ్
- పనులు ప్రారంభ దశలో ఉత్సాహం
- ఇప్పుడు గాలికొదిలేసిన వైనం



సుందరీకరణ పనులు పూర్తయ్యేదెన్నడు?

భాగ్యనగర్‌కాలనీ: కోట్లాది రూపాయల నిధులు వెచ్చించినా అంబీర్ చెరువు సుందరీకరణ పనులు నామమాత్రంగానే కొనసాగాయి. నిధులు లేకనా? కాంట్రాక్టర్‌ల అలసత్వమా? తెలియదు కానీ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా పనులు నిలిచిపోయాయి. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని 150 ఎకరాల విస్తీర్ణంలో కలిగి ఉన్న అంబీర్‌చెరువు ఒకటి. చెరువు పరిసర ప్రాంతాలు కబ్జాకు గురి కాగా ప్రస్తుతం దాదాపు 54 ఎకరాలు ఉన్నట్లు అధికారిక సమాచారం. ఈ చెరువులో మురుగునీరు, కబ్జాలకు గురవుతోందని స్థానిక ప్రజా ప్రతినిధులు క్రింది స్థాయి నాయకులు గతంలో మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు.

◆ దీంతో 2017లో మంత్రి కేటీఆర్ అంబీర్ చెరువును సందర్శించి మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చాలని అధికారులను ఆదేశించారు. ఆ సమయంలోనే 25 కోట్ల రూపాయల నిధులు కూడా మంజూరు చేసి పనులను చేపట్టాలని కోరారు. అయితే ప్రతిపాదనలు సిద్ధం చేసి టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి 2018లో పనులు ప్రారంభించారు. ప్రారంభించిన సమయంలో అధికారులు చూపించిన హడావుడి రానురాను సుందరీకరణ పనులు మందకొండిగా సాగటమే కాకుండా ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

◆ మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణంలో భాగంగా చెరువు చుట్టూ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, వాకింగ్ ట్రాక్ పనులు చేపట్టారు. అదే విధంగా చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి వదిలేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సుందరీకరణ పనులు ఇసుమంత కూడా ముందుకు సాగటం లేదు. వర్షాలు వస్తే చాలు వాకింగ్ ట్రాక్ పూర్తిగా బురదమయంగా మారుతుంది. దీంతో ఈ వాకింగ్ ట్రాక్‌పై నడవటానికి వీలులేకుండా ఉంటుంది. ఇటీవల చెరువులో పెద్ద మొత్తంలో గుర్రపుడెక్క పెరిగిపోవటంతో ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి నెల రోజుల పాటు గుర్రపు డెక్కను జేసీబీల సహాయంతో తొలగించి వాకింగ్ ట్రాక్ కట్టపైనే వదిలేశారు.

◆ దాదాపు రెండు, మూడు నెలలు అవుతున్నా గుర్రపుడెక్కను అక్కడి నుంచి తరలించకపోవటంతో పూర్తిగా ఎండిపోయి దుర్వాసనతో పాటు దోమలకు ఆవాసంగా మారాయి. రాత్రి అయిందంటే చాలు దోమలు ఇళ్లపై స్వైర్య విహారం చేస్తున్నాయి. దీనికి తోడు కొందరు మురుగునీటిని సైతం చెరువులోకి వదులుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దాదాపు ఐదు సంవత్సరాలు గడుస్తున్నా అంబీర్ చెరువు సుందరీకరణ పనులు నత్తనడకన కొనసాగుతుండటంతో పరిసర ప్రాంత కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

◆ మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిదుతారన్న స్థానిక ప్రజల ఆశలు అడియాశలుగానే మిగిలిపోతున్నాయి. ప్రజాప్రతినిధులు చెరువును పరిశీలించడానికి వచ్చినప్పుడు అధికారులు అత్యుత్సాహం చూపించడమే తప్ప తిరిగి చెరువు వైపు కన్నెత్తి చూసిన పాపాన పోవటం లేదు. ఇప్పటికైనా అంబీర్ చెరువును అధికారులు, ప్రజా ప్రతినిధులు పరిశీలించి పనులను ఎక్కడ వరకు పూర్తయ్యాయో చూసి అసంపూర్తిగా ఉన్న పనులను నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పనులను పూర్తి చేయాలి



చెరువు సుందరీకరణ పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా అసంపూర్తిగా మిగిలిపోయాయి. డ్రైనేజీ పనులు, ఫెన్సింగ్‌తో పాటు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. వాకింగ్ ట్రాక్ అసంపూర్తిగా చేపట్టడంతో అధ్వానంగా మారింది. చెరువులో గుర్రపుడెక్కను తొలగించి పక్కనే పడవేస్తుండటంతో వాకర్స్‌కు ఇబ్బందికరంగా ఉంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇప్పటికైనా చెరువు సుందరీకరణ పనులు పరిశీలించి అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలి.

– శ్రీను, శ్రీనివాసకాలనీ